క్లుప్తంగా

జిల్లా సహకార అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన ఒంగోలు జిల్లా అధికార అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఇక్కడ బదిలీపై వచ్చారు. ఇక్కడ జిల్లా సహకార అధికారిగా పనిచేసిన వెంకటకృష్ణ 20 రోజులు క్రితం కర్నూల్ బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారిగా పీబీఎంఎం కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

30న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శనివారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కృష్ణప్రభాస్ పేపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ, మెకానికల్ ట్రైనీ, వియాష్ లైఫ్ సైన్సెస్ కంపెనీలో టెక్నీషియన్, జేకే ఫెన్నర్‌లో టెక్నీషియన్, లాక్సన్ బేబి వరల్డ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్, స్టోర్ మేనేజర్, బొలెరో, బొలెరో కార్ డ్రైవర్, ఐసాన్ ఎక్స్‌పీరియన్‌సెస్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రెజంటేటీవ్, ఇసుజు మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ డిక్సాన్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. అదే విధంగా డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా టూ వీలర్ టెక్నీషియన్, లాజిస్టిక్స్‌లో ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. ట్రైనింగ్ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులందరూ ఈనెల 30న వికాస కార్యాలయం కలెక్టరేట్, కాకినాడ వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరు కావాలని పీడీ లచ్చారావు తెలిపారు.

ఏపీ పీజీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: ఏపీ పీజీసెట్–25లో ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కే.కరుణ శనివారం తెలిపారు.రాష్ట్ర స్థాయిలో 10 లోపు 4 ర్యాంకులు,1 00లోపు 22 ర్యాంకులు, 1000లోపు 42 ర్యాంకులు సాధించారన్నారు. గణిత శాస్త్రంలో కే.వైష్ణవి ఒకటో ర్యాంక్, సీహెచ్ సాయిశ్రీదుర్గ మూడో ర్యాంక్, కంప్యూటర్‌సైన్స్‌లో బి.సత్యఅభినయం మూడో ర్యాంక్, ఎ.శ్రావణి 8వ ర్యాంక్ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల కార్యదర్శి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు.

పెనుగుదురులో వ్యక్తి మృతదేహం గుర్తింపు



పెనుగుదురులో రోడ్డుపక్క పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న కరప ఎస్ఐ సునీత

కరప: పెనుగుదురు సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుగుదురులోని సంధ్య ఫిజియోథెరపీ కళాశాలకు వెళ్లే దారిలో గుర్తు తెలియని మృతదేహం రోడ్డు పక్కన పడి ఉంది. మృతదేహం గుర్తు తెలియని వ్యక్తిదని, అతనికి 40 సంవత్సరాలు వరకు ఉంటాయని, రెండు చేతులపై కాలిన గాయాలు, శరీరంపై దుస్తులు లేకుండా చనిపోయి ఉన్నాడని సమాచారం అందడంతో ఆ గ్రామ వీఆర్వో ఘటన స్థలాన్ని పరిశీలించారు. వీఆర్వో ఫిర్యాదుతో కరప ఎస్ఐ టి.సునీత సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడు పది రోజుల నుంచి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాడని, వారం రోజుల క్రితం గ్రామంలోని రైసుమిల్లు వద్ద ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకోవడం వల్ల రెండు చేతులకు గాయాలయ్యాయని పోలీసులు విచారించగా స్థానికులు తెలిపారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు.

'అమరావతి'కి అప్పు తప్ప ఏమీ లేదు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అప్పు తప్ప మరేమీ చేయడం లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి వచ్చిన ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో 11 ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడం లేదని అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తొలుత ఆమె నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి తిలక్ వర్మ, సీడబ్ల్యూసీ సభ్యులు పళ్లంరాజు, జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుతూ..

- సార్వా సాగుకు రైతులు సిద్ధం
- నారుమళ్ల తయారీ నిమగ్నం
- కరప మండలంలో 14 వేల ఎకరాల్లో వరిసాగు

కరప: వర్షాలు పడడం, పంటకాలువలకు నీరు వస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈనెల ఒకటో తేదీ కాలువలకు నీరొదిలినా మండలంలోని కాలువలకు నీరు రావడానికి మూడు వారాలు పట్టింది. నైరుతి రుతు పవనాలు రాక ఆలస్యమవ్వడం ఒక కారణమైతే, నీరొదిలిన తర్వాత కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత పనులు చేపట్టడం మరో కారణం వెరసి సార్వా సాగు ఆలస్యమైందని రైతులు అంటున్నారు. వారం రోజుల నుంచి ఆకాశం మబ్బుపట్టి, అడపా, తడపా వర్షాలు పడుతుండటంతో నారుమళ్లు వేసుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు.

మండల పరిధిలో ఖరీఫ్‌లో సుమారు 14 వేల ఎకరాలు సాగు చేస్తున్నట్టు అంచనా. సార్వాలో ముందస్తు సాగు చేపట్టాలని దాని వల్ల పంట చివరిలో అంటే నవంబరులో వచ్చే తుపాన్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని, జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరొదిలారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం, సాగునీరు సక్రమంగా రాక నారుమళ్లు పోసుకోవడానికి ఆలస్యమైందని రైతులు అంటున్నారు. మండలంలోని భూములన్నీ కూడా కాలువలకు శివారున, సముద్రతీరాన ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలవారితో పోలిస్తే వారం పది రోజులు ఆలస్యమవుతుంది. అయితే కాలువలకు నీరు వచ్చిన ప్రాంతాల్లో ముందుగా నారుమళ్లు వేసుకోగా, శివారు ప్రాంత రైతులు ఇప్పుడిప్పుడే వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు వెదజల్లు పద్ధతి అనుసరిస్తున్నారు. శివారు ప్రాంత రైతులు, మెరక భూములలో నీరెక్కకపోవడంతో గుళ్లలతో, ఇంజన్లతో సాగునీరు తోడుకుని, నారుమళ్ల తయారీకి దమ్ముచేసి, సదును చేసుకుంటున్నారు.

అందని పెట్టుబడి సాయం

ప్రతి ఏటా వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుబడి సాయంగా రూ.15 వేలు మే నెలాఖరు కల్లా రైతుల అకౌంట్లలోకి నేరుగా జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. తొలకరి పంట పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తోందని రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పెదకొత్తూరు సమీపంలో సార్వా సాగుకు మురగ చేస్తున్న దమ్ము ట్రాక్టర్

అందని రబీ పంట సొమ్ములు

రైతు సేవా కేంద్రాల్లో రబీ పంట ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల అకౌంట్లలోకి సొమ్ములు జమ చేస్తామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. ప్రారంభంలో రెండు వారాలు సొమ్ములు చెల్లించారు. తర్వాత అమ్మకాలు జరిపిన రైతులకు నెల రోజులైనా చెల్లించడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అమ్మిన ధాన్యానికి సొమ్ములు చెల్లించక, పెట్టుబడి సాయమందిస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం అమలుకాక పెట్టుబడులకు అప్పులు చేసుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చినకొత్తూరు సమీపంలో ముదరగా పెంచిన నారుమడి

నారుమళ్ల తయారీలో యాజమాన్య పద్ధతులు



పంట కాలువలకు సాగునీరు వస్తుండడం, వర్షాల పడడంతో రైతులు నారుమళ్లు వేసుకుంటున్నారు. నారుమళ్ల తయారీలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీనిలో కొన్ని మెళకువలు పాటిస్తే దృఢమైన నారు తయారవుతుంది. విత్తనాలు చల్లడానికి ముందు నారుమడిని మురగదమ్ము చేసుకోవాలి. ఒక ఎకరా విస్తీర్ణంలో వరినాట్లు వేయడానికి 5 సెంట్ల భూమిలో నారుమడిని తయారు చేయాలి. 5 సెంట్ల నారుమడిలో సిఫారసు చేసిన మోతాదులో ఎరువులను వాడాలి. మొలకెత్తిన విత్తనాలు ఒకసెంటు నారుమడికి 5 కిలోల వంతున చల్లుకోవాలి. విత్తనాలు చల్లే ముందు సోడోమోనస్ లేదా కార్బండిజమ్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల చీడ, పీడలు ఆశించకుండా నారు దృఢంగా తయారవుతుంది. రైతులు ఈ మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి లభిస్తుంది. రైతు సేవా కేంద్రాల్లో ఎంటీయు–7029(స్వర్ణ) రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 30 కిలోల ప్యాకెట్ ధర రూ.1260. కిలోకు రూ.5లు వంతున రాయితీపై రూ.1110లకు రైతులకు సరఫరా చేస్తున్నాం.

– ఇమ్మిడిశెట్టి సత్య, కరప మండల వ్యవసాయాధికారి

అప్పులు చేస్తున్నాం



కాలువలకు నీరు రావడం ఆలస్యమైంది. ముసురు పట్టి కాలువలకు నీరు రావడంతో ఇప్పుడిప్పుడే నారుమళ్లు వేసుకునే పనులు చేసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం కనీసం పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. దీనివల్ల అప్పులుచేసి సార్వాకు ఆకుమళ్లు వేసుకుంటున్నాం. మురగ దమ్ము చేయించేందుకు పనులు చేసుకుంటున్నాం.

– వాసంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు, వలసపాకల

తొలకరిపై ఆశలు పెట్టుకున్నాం



కాలువలకు ముందుగానే నీరొదిలినా, మృగశిర కార్తెలో కాలువలకు సాగునీరు రాక సాగుపనులు ఆలస్యం చేశాం. గత ఏడాది తొలకరి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు పడడంతో నష్టపోయాం. ఈ ఏడాది వాతావరణం అనుకూలించి, పంటలు బాగా పండాలని, భగవంతునిపై భారం వేసి, నారుమడి వేస్తున్నాం.

– రెడ్డి వీరభద్రరావు, రైతు, కరప

ఓటాలజీ వర్క్ షాపు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ కుళాయి చెరువు ఆవరణలో ఉన్న ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో ఈఎన్‌టీ నిపుణుల లైవ్ సర్జికల్ ఓటాలజీ(చెవి ఆరోగ్యాన్ని అధ్యయనం చేసే విభాగం) వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగ్లోలజిస్ట్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ(ఏవోఐ ఏపీ), టీం ఈఎన్‌టీ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యశాల నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌కి రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి 400 మంది ఈఎన్‌టీ నిపుణులు మరో 150 మంది ఇతర స్పెషాలిటీ వైద్య నిపుణులు హాజరయ్యారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ప్రొఫెసర్ విజయేంద్ర హోన్నూరప్ప ఆధ్వర్యంలో డాక్టర్ వినయ్ విజయేంద్ర, డాక్టర్ సంగీతలు లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్లు, అసిస్టెంట్లు, పీజీ వైద్యులు వర్క్‌షాప్‌లో చెవి నిర్మాణం, పనితీరు, లోపాలు, వ్యాధులు, చికిత్స, అందుబాటులోకి వచ్చిన నూతన వైద్య విధానాలు, సాంకేతికత జోడించిన శస్త్రచికిత్సలు, రోబోటిక్ ప్రక్రియలపై నిర్వహించిన కార్యశాలలో చురుకైన పాత్ర పోషించారు.

తూర్పు గోదావరి క్రికెట్ లీగ్‌కు పేర్లు నమోదు చేసుకోవాలి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): తూర్పుగోదావరి క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న తూర్పుగోదావరి క్రికెట్ లీగ్ టోర్నీలో ఆడేందుకు అర్హత ఉన్న క్రికెట్ క్లబ్‌లు తమ పేర్లు 2025–26 సంవత్సరానికి నమోదు చేసుకోవాలని క్రికెట్ సంఘ కార్యదర్శి పసుపులేటి సత్యనారాయణ శనివారం తెలిపారు. గతంలో 20 టీమ్‌లు ఉండగా అందులో కోనసీమ బాయ్స్, పెద్దాపురం సబ్ సెంటర్, రామండ్రి బ్లూస్, రాయల్ క్రికెట్ క్లబ్, ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్, ఎంఎస్ క్రికెట్ క్లబ్, ఈజీ డీసీఏ, కరప క్రికెట్ క్లబ్‌ను ఏ లీగ్ క్రికెట్ ప్రవేశానికి ఎంపిక చేశామన్నారు. ఈ టీమ్‌ల కెప్టెన్లు, క్రికెట్ అసోసియేషన్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే క్రికెట్ లీగ్ నిర్వహణకు ఎంపైర్లు, స్కోరర్లు కావాలని ఆసక్తి ఉన్న దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9885276888 నంబరుకు సంప్రదించాలని కోరారు.

నారాయణమూర్తి సేవలు అందరికీ ఆదర్శం



కరపలో దాతలు బహూకరించిన సిమెంట్ బెంచీలు ప్రారంభిస్తున్న హెచ్ఎం రాజరాజేశ్వరీదేవి

కరప: చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శమని కరప హైస్కూలు హెచ్ఎం నాగం రాజరాజేశ్వరి దేవి పేర్కొన్నారు. స్థానిక గంటాలమ్మ, సాయిబాబా గుడికి ఉపాధ్యాయుడు నారాయణమూర్తి తనతల్లి చంద్రావతి వర్ధంతి సందర్భంగా సమకూర్చిన నాలుగు సిమెంట్ బెంచీలు శనివారం హెచ్ఎం ప్రారంభించి, మాట్లాడారు. ఈ గుడి వద్ద ప్రతి గురువారం అన్నదానం జరుగుతుందని, భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు సిమెంట్ సోఫాలు బహూకరించాలని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కోరగా వీటిని ఇచ్చినట్టు దాత నారాయణమూర్తి తెలిపారు. మాజీసర్పంచ్ తాతీలు, గ్రామస్తులు చింతా అన్నవరం, ఎస్.వెంకటేశ్వరరావు, అనిశెట్టి నారాయణప్రసాద్, మాధవరపు సన్నీప్రసాద్, చిన్నారి మురళీకృష్ణ, మంచాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త ఉయ్యూరి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజు

బోట్‌క్లబ్: ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు అన్నారు. కాకినాడ బ్రాంచ్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక సూర్య కళామందిరంలో జరిగింది. సొసైటీ స్థాపించి 28 సంవత్సరాలు పూర్తయిందని 42 శాఖలతో ఆరు రాష్ట్రాల్లో రూ.4,460 కోట్ల వ్యాపారంతో దిగ్విజయంగా నడపబడుతూ దేశంలో అతిపెద్ద మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీగా నిలిచిందన్నారు. సొసైటీ సభ్యులుగా ఉన్న వారి పిల్లలు విద్యారంగంలో మంచి ర్యాంకులు సాధిస్తే వారందరికీ నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. త్వరలో రాయితీపై మెడికల్ దయాగ్నస్టిక్ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. రూ.100 కోట్లు డిపాజిట్లు దాటిన సిటిజన్ బ్రాంచ్ శాఖలకు సొంత భవనాలను నిర్మించే ప్రతిపాదనను చేపట్టామన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కాకినాడ బ్రాంచ్ ప్రారంభించి 21 సంవత్సరాలు పూర్తయిందని, ఈ బ్రాంచ్‌లో మొత్తం రూ.175 కోట్ల వ్యాపారం దిగ్విజయంగా నడుస్తుందన్నారు. సొసైటీ డైరెక్టర్ జె.సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ బ్రాంచ్ సభ్యులు 21 సంవత్సరాలుగా సహాయ సహకారం అందడం వల్లే ఇంతటి అభివృద్ధి సాధించామని అన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఎం.సూర్యారావు, స్వప్న సాధ చంద్రశేఖర్, బ్రాంచ్ మేనేజర్ ఎస్ఎస్ నాయుడు, రాజమండ్రి బ్రాంచ్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన యువకులు.. ఆసుపత్రికి తరలింపు

యానాం: యానాం వద్ద బాలయోగి వారధి నుంచి గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం కాకినాడకు చెందిన తలాటం శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం బాలయోగి వారధి నుంచి గౌతమీ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో గోదావరిలో కొట్టుకుపోతున్న శ్రీనివాసరావును స్థానిక యువకులు మల్లాడి వెంకట్, కాలాడి విజయ్, పోతాబత్తుల దుర్గాప్రసాద్, కిరణ్ తదితరులు గమనించి తక్షణం స్పందించారు. యానాం టూరిజం శాఖకు చెందిన బోట్ల సహాయంతో శ్రీనివాసరావును రక్షించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం అపస్మారకస్థితిలో ఉన్న ఆయనను బైక్‌పై యానాం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు కాకినాడ నల్లావారి వీధి, కర్ణంగారి జంక్షన్ ప్రాంతానికి చెందిన వాడిగా అతని వద్దనున్న ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీనివాసరావును కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. యానాంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేతతో గోదావరి ఒడ్డున యువకులు కాలక్షేపంకోసం కూర్చున్నారని ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు కొట్టుకుపోతుండటం గమనించి అతని రక్షించడంతో స్థానికులు, పోలీసులు వారిని అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: అప్పుల బాధతో ఈనెల 12న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తమ్మవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి చక్రధరరావు(40) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తిమ్మాపురం పోలీసులు వివరాల ప్రకారం.. చక్రధరరావు గైగోలుపాడు సెంటరులో గతంలో కిరాణా షాపుతో చిట్స్ నిర్వహించాడు. చిట్స్ వసూళ్లు సక్రమంగా లేక బాకీ వారి ఒత్తిళ్లకు సమాధానం చెప్పలేక ఆత్మహత్య యత్నానికి పాల్పడి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు అడిషనల్ ఎస్సై మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5న జాతీయ లోక్ అదాలత్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి ఆనంది, చిత్రంలో న్యాయమూర్తులు

కాకినాడ లీగల్: కాకినాడ మూడో అదనపు జిల్లా కోర్టులో పోలీసు అధికారులుతో అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది శనివారం సమావేశం నిర్వహించారు. జులై ఐదో తేదీన కాకినాడలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో రాజీ పడదగిన కేసులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

న్యాయవాదులతో సమావేశం

న్యాయవాదులతో కాకినాడ జిల్లా జడ్జి జి.ఆనంది సమావేశంలో సివిల్ కేసులు, బీమా కేసులు, ఇతర కేసులు ఎక్కువ కేసులు పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు.

ప్రత్యేక సబ్‌జైలు పరిశీలన

స్థానిక ప్రత్యేక సబ్ జైల్‌ను శనివారం మూడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది తనిఖీ చేశారు. వంటశాల, సామగ్రి గది, మహిళా ఖైదీల బ్యారక్, రికార్డులు పరిశీలించారు.

పరుపుల అందజేత



పరివర్తనకు పరుపులు అందిస్తున్న రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీక్లబ్ కాకినాడ సెంట్రల్ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక భాస్కర్‌నగర్‌లోని పరివర్తన వీధి బాలల పునరావాస కేంద్రానికి 30 పరుపులను విరాళంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణమోహన్, క్లబ్ సెక్రటరీ ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ హరిబాబు ఆధ్వర్యంలో పరుపులను పరివర్తన కేంద్రం కార్యదర్శి వక్కలంక రామకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణమోహన్ మాట్లాడుతూ పరివర్తన వీధి బాలల పునరావాస కేంద్రం నిర్వహణ ఎంతో బాగుందని, ఇటువంటి సంస్థకు తమ వంతు బాధ్యతగా పరుపులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పరివర్తన బాలలకు కావాల్సిన ఇతర వస్తువులు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. పరుపులు అందించిన క్లబ్ సభ్యులకు పరివర్తన కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, కోశాధికారి దాట్ల సత్యాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పంచాయతీ కార్యాలయంలో బదిలీలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లా పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పలువురికి బదిలీ, పదోన్నతులు లభించాయి. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఐ.నాగశ్రీనివాస్‌ను గండేపల్లి మండల డిప్యూటీ ఎంపీడీఓ పదోన్నతి లభించింది. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పని చేస్తున్న సుజాతకు కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కోనసీమ జిల్లా పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న అనితకు కాకినాడ జిల్లా బదిలీ అయ్యారు.

ఎమ్మార్వో ఆఫీస్‌లో టీవీ చోరీ

కాకినాడ క్రైం: కాకినాడ అర్బన్ ఎమ్మార్వో ఆఫీస్‌లో హాల్‌లో ఉన్న టీవీ చోరీకి గురైందని డిప్యూటీ ఎమ్మార్వో కృష్ణకుమారి శనివారం కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మే నెలలో చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మీడియా ఛానల్ కార్యాలయంపై దాడికి ఖండన

సాక్షిప్రతినిధి, కాకినాడ: మీడియా చానల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు డి.అంజిబాబు, కార్యదర్శి అర్జున్ ఖండించారు. హైదరాబాద్‌లోని మహా టీవీ ప్రధాన కార్యాలయం జరిగిన దాడికి విచారం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో దాడులకు తావు లేదని వారన్నారు. మహా టీవీ ఎండీ, చైర్మన్ వంశీకి, మహా టీవీ టీమ్‌కి, జర్నలిస్టులకు శనివారం కాకినాడ జిల్లా శాఖ సంఘీభావం ప్రకటించారు. ఈ దాడికి నిరసనగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక రామకృష్ణ సేవా సమితి ఆడిటోరియంలో శనివారం 50 మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందిజేసిన సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు వీఎల్ గాంధీ, ఉపాధ్యక్షుడు వక్కలంక రామకృష్ణ, కార్యదర్శి కె.సతీష్, సభ్యులు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం

- క్లబ్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ
- ఘనంగా లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ పదో వార్షికోత్సవం
- నూతన అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన ప్రసాద్ నాయుడు



రమణయ్యపేటలో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న బాలకృష్ణ

కాకినాడ రూరల్: సేవే ధ్యేయంగా సభ్యులు పనిచేయాలని, పేదలకు సేవ చేయడం, వారి జీవితాలను మెరుగుపరచడమే లయన్స్ క్లబ్‌ల లక్ష్యమని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టరు బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ మల్టీ సర్వీసెస్ సెంటరు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ పదో వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇప్పటి వరకు పని చేసిన పాలక వర్గ సేవలను అభినందించి, నూతన పాలక వర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ కాకినాడ స్టార్స్ నూతన అధ్యక్షుడిగా ఎఫ్‌సీఐ మాజీ జనరల్ మేనేజరు ఇండుగుల ప్రసాద్ నాయుడు నియమతులయ్యారు. కార్యదర్శి, కోశాధికారిగా నియమితులైన నాగేంద్రగాంధీ, కొప్పర్తి సాయికృష్ణ, బోర్డు సభ్యులతో బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా 30 మంది పేదలకు బియ్యం, నిత్యావసర సరకులు, పేద మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, నూతనంగా ఎన్నికైన గవర్నర్ కృష్ణప్రసాద్, చిట్నీడి శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, పద్మ తులసి, నమశ్శివాయ, ఇంద్రగంటి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, గణేష్ ప్రసాద్, సాయి ప్రదీప్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌గా పద్మ శశిధర్



కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ప్రముఖ చంటి పిల్లల వైద్య నిపుణురాలు, జోన్–2 వైద్య ఆరోగ్య సేవల రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పులగం పద్మా శశిధర్ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు(డీపీహెచ్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్)గా నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కాకినాడకు చెందిన డాక్టర్ పద్మశశిధర్ 1984లో విశాఖపట్టణంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, 1987లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పీజీ పూర్తి చేశారు. అదే ఏడాది అక్టోబర్‌లో సంపరలో ప్రభుత్వ డిస్పెన్సరీ వైద్యాధికారిగా తొలి పోస్టింగ్ పొంది బాధ్యతలు చేపట్టారు. తర్వాత కాకినాడ జీజీహెచ్‌లో బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఆర్ఎంసీలో ఫిజియోలజీ, పీడియాట్రిక్స్ డిపార్టుమెంట్లలో బోధకురాలిగా పని చేశారు. డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ డిపార్టుమెంట్‌లో పనిచేశారు. అదే హోదాలో కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం, తాళ్లరేవులో సీహెచ్‌సీలలో పని చేసిన అనుభవం ఉంది. కాకినాడ జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టి కోవిడ్ సమయంలో ఆసుపత్రిలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం పదోన్నతి పొంది రాజమహేంద్రవరంలో జోన్–2 వైద్య ఆరోగ్య సేవల రీజినల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజా ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు(డీహెచ్)గా నియమితులయ్యారు. ఆమెకు రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరసింహం, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు అభినందనలు తెలిపారు.

భిక్షాటన లేని సమాజాన్ని నిర్మిద్దాం



బిడ్డతో భిక్షాటన చేస్తున్న తల్లికి కౌన్సెలింగ్ ఇస్తున్న కౌన్సిలర్ దుర్గారాణి, చిత్రంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ

కాకినాడ క్రైం: భిక్షాటన లేని సమాజాన్ని నిర్మించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి(పీవోపీఎన్‌బీసీ) కె.విజయ పిలుపునిచ్చారు. కాకినాడ నగరంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.విజయకుమారి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణాధికారి(డీసీపీవో) సీహెచ్ వెంకట్రావు పర్యవేక్షణలో బాలల సంరక్షణ విభాగం(డీసీపీయూ) అధికారులు, సిబ్బంది శనివారం సాయంత్రం భిక్షాటన బాలల డ్రైవ్, అవుట్ రీచ్ నిర్వహించారు. డ్రైవ్‌లో భాగంగా సమీపంలో ఓ మహిళ ఆడ శిశువుని చూపి భిక్షాటన చేస్తుండడాన్ని గుర్తించారు. ఆమె వివరాలు సేకరించిన కౌన్సిలర్ బి.దుర్గారాణి మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరో సారి భిక్షాటనకు పిల్లతో వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కాకినాడ బస్టాండ్ సమీపంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతల సహకారంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం(డీసీపీయూ) సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పీవో విజయ మాట్లాడుతూ, బాలల అక్రమ రవాణా, బాల కార్మికులు, బాలలపై హింసను గుర్తిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. బాలల భవితను నిర్వీర్యం చేసే చర్యలను ఉపేక్షించవద్దని కోరారు. డ్రైవ్, అవుట్‌రీచ్‌లో డీసీపీయూ సోషల్ వర్కర్ ఎస్.చినబాబు, డీఈవో కె.రాంబాబు సహా అవుట్ రీచ్ వర్కర్ ఆర్.దుర్గా భవాని పాల్గొన్నారు.

వీకేఆర్ నగర్‌లో పబ్లిక్ పార్కు ప్రారంభం

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడి గ్రామ పంచాయతీ వీకేఆర్ నగర్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్ సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసిన పబ్లిక్ పార్క్‌ను స్థానిక కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) ప్రారంభించారు. ఈ అభివృద్ధికి మొత్తం రూ.60 లక్షలు కోరమాండల్ సీఎస్ఆర్ నిధుల నుంచి వెచ్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, మండల అభివృద్ధి అధికారి పి.సతీష్, ఈవో పిడుగు పాండురంగారావు, వీఆర్‌కే నగర్ అసోసియేషన్ సభ్యులు, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యూనిట్ హెడ్‌డీహెచ్ శ్రీనివాసరావు, జీఎంహెచ్ ఆర్.పద్మనాభం, హెచ్ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.